# శాంతి

# SANTI

విశ్వమానవ సాభ్రాతృత్వ సందేశము గల ఆధ్యాత్మిక మాసపత్రిక

June / జూన్ -2024

ప్రణవోధనుః శరోహ్యాత్మా బ్రహ్మతల్లక్ష్యముచ్యతే
అప్రమత్తేన వేద్ధవ్యం శరవత్ తన్మయోభవేత్

ఏకం సత్ విప్రా బహుధా వదంతి
ఒకే సత్యము అనేక విధములుగా బ్రహ్మజ్ఞులచే చెప్పబడినది.

- ఋగ్వేద సంహిత


# శాంతి
# SANTI

**విశ్వమానవ సౌభ్రాతృత్వ శాంతి సందేశ ఆధ్యాత్మిక మాసపత్రిక**

**స్థాపకులు : పరమపూజ్య శ్రీస్వామి ఓంకార్‌జీ మహరాజ్**

**సంపాదకులు : స్వామిని వినమ్రానంద**

VoL./ సంపుటి : **100** June / జూన్ **-2024** No./ సంచిక : **6**


| వ.నెం. | విషయసూచిక | పేజి నెం. |
|---|---|---|
| 1. | ప్రార్థన - గురుస్తోత్రం | 2 |
| 2. | ధ్యానము - శ్రీ గురు పాదుకాస్తవము | 2 |
| 3. | శ్రీ ఓంకార్ ఆత్మకథ - అనువాదం : బొప్పన అరుణాదేవి | 3 |
| 4. | జగద్గురు నానక్ దేవ్ - కాటూరు రవీంద్రత్రివిక్రమ్ | 10 |
| 5. | ఆనంద రామాయణము - పరిష్కర్త స్వామి సత్యాత్మానంద | 12 |
| 6. | గురువాచకకోవై - మురుగనార్ | 16 |
| 7. | మానసోల్లాసము - శ్రీ వింజమూరి రాధాకృష్ణ | 18 |
| 8. | వేదము - శాంతి - శ్రీ ఈశ్వరానంద భారతి | 22 |
| 9. | కార్యక్రమములు - విరాళములు | 25 |


ఈ పత్రికలో ప్రచురింపబడిన వ్యాసముల యొక్క భావాలకు రచయిత్రి / రచయితలే బాధ్యులుకాని, సంపాదకులు కారు.

జీవిత సభ్యత్వం రూ. **1000/-** లు సాలుసరి రూ. **100/-**




# ప్రార్థన

## గురుస్తోత్రం

శ్లో॥ ఓం సచ్చిదానంద రూపాయ వ్యాపినే పరమాత్మనే ।
నమో వేదాంత వేద్యాయ గురవే బుద్ధి సాక్షిణే ॥

సత్తు, చిత్తు, ఆనందము అనునవియే స్వరూపముగా గలవాడును, వ్యాపకుడును, పరమాత్మ స్వరూపుడును, వేదవేదాంతములచే తెలియదగినవాడును, దేహేంద్రియ మనో బుద్ధులకు సాక్షిగా నుండు వాడును నగు గురువునకు నమస్కారము.

# ధ్యానము

(శ్రీ సద్గురు పాదుకాస్తవం)

శ్లో॥ పంచవర్ణ శుచిర్విచిత్ర విశుద్ధతత్త్వ విచారణం
చంద్రసూర్య చిదగ్నిమండల మండితం ఘనచిన్మయమ్
చిత్కళా పరిపూర్ణమంతర చిత్సమాధి నిరీక్షణం
ప్రాతరేవహి మానసాంతరి భావయేద్గురు పాదుకామ్॥ 8

అయిదు రంగులలో శుభ్రంగా ఉంటూ విచిత్రంగా శుద్ధమైన తత్త్వవిచారణ చేయించేది, సూర్యచంద్రాగ్ని చిన్మండలాలతో విలసిల్లుతూ, కేవల చైతన్య రూపమైన దానిని, చిత్కళలతో పరిపూర్ణ లోపల చిత్సమాధి కోసం నిరీక్షింపజేసే గురుపాదుకను మనస్సులోపల ప్రాత:కాలంలోనే ధ్యానించాలి.

**సత్యాన్వేషి యగువాడు యీ శరీరమును గూర్చి చింతింపరాదు. ఎంతవరకు శరీరమును ధరించి యుందుమో అంతవరకు ఏదో ఒక రూపమున రుసుము చెల్లింపవలసినదే. శరీరము అద్దె కొంప వంటిది. లక్షాధికారి అయినను, సాధువైనను, సన్యాసి అయినను, ఎవరయినను రుసుము చెల్లింపక తీరదు. కావున ఎవరైనను యీ శరీరము విషయమై చింతింపక, దైవమునే స్మరింపవలెను. అట్టివారే నిజముగు సత్యాన్వేషి కాగలరు. - స్వామి ఓంకార్**

# శాంతి ప్రదాత శ్రీ ఓంకార్ స్వామిజీ ఆత్మకథ

**మూలం : స్వామిఓంకార్** **అనువాదం : బొప్పన అరుణాదేవి**

(గత సంచిక తర్వాత)

## అధ్యాయం - 51

## తోటపల్లి కొండలకి తిరిగి వచ్చాము

ఉషోదయము కాగానే ప్రశాంతమయిన నిశ్శబ్ద వాతావరణంలో నెమ్మదిగా నా గది తలుపులు తెరుచుకుని వరండాలోనికి వచ్చాను. అందమయిన ఆ ప్రశాంత మయిన సమయంలో అక్కడే కూర్చోవాలని అనిపించింది. మసకబారుతున్న చంద్రుడు దారికి ఇరువైపులా బారులు తీరిన పొడవైన వృక్షాలపైన కనిపిస్తున్నాడు. వాతావరణం ఎంతో ప్రశాంతంగా, ఆహ్లాదకరంగా ఉంది. గదిలోకి వెళ్ళాలనిపించలేదు. కుర్చీ బయటికి లాక్కుని అందులో కూర్చుని నిండుగా పుష్పించిన వృక్షాల వంక చూస్తుండి పోయాను. అందమైన అర్చిలాగా కనిపిస్తున్న చెట్ల మధ్య నుండి చంద్రుడు తొంగి చూస్తున్నాడు. అంత అందమైన ప్రకృతి సౌందర్యాన్ని అనుభవించాలే తప్ప మాటల్లో వివరించటం చాలా కష్టం. అందువలన నేను చంద్రుని వృక్షాల హృదయంలోనికి చూస్తూ గమనిస్తూ, వాటి అందాల్ని, ప్రేమని ధ్యానిస్తూ ఆనందాన్ని అనుభవించ సాగాను. జోయీ కిల్మర్ మాటలు గుర్తుకు వచ్చాయి. ఆయన అంటాడు 'వృక్షాన్ని మించిన అందమయిన కవితను నేనెప్పుడూ చూడలేదని నాకు అనిపిస్తుంది. కవితలు నా లాంటి తెలివి తక్కువ వాళ్ళు రాస్తారు. కాని పరమాత్మ మాత్రమే వృక్షాలను సృష్టించగలడు".

అవును నిజంగా వృక్షాలు భగవంతుడు రచించిన కవితలు లాంటివి. ఆయన చాలా అందమయిన కవితలు సృష్టిస్తాడు. మధురమయిన సువాసనలు వెదజల్లే కవితలు, అలాగే కొన్ని వేల రకాలయిన అద్భుతమయిన కవితలు వృక్షాల మీద రాస్తాడు. మా ఆశ్రమంలోని వృక్షాలను నేను ఎంతగానో ప్రేమిస్తాను. ప్రపంచంలోని ఇంకే ఇతర వృక్షాల పట్లా నాకంత ప్రేమ ఉండదు. మా ఆశ్రమ వృక్షాలు నా శరీరంలోని రక్తమాంసాలు లాగా అనిపిస్తాయి. వాటిని నా చేత్తో స్వయంగా నాటి పెంచి పోషించాను. వృక్షాలు అన్నీ ఒక్కటే అయినా నా ఆశ్రమంలోని వృక్షాలు మాత్రం నాతో మాట్లాడుతాయి. వాటిని పట్టించుకోనప్పుడు, సరిగ్గా నీరు పెట్టనప్పుడు



అవి తలలు వాల్చి నాతో మాట్లాడుతాయి. భౌతిక ప్రపంచములోని వారికి ఇది వింతగా అనిపించవచ్చు. ఏదయినా సరిగ్గా పోషణ లేని వృక్షాల పక్క నుండి నేను నడిచేటప్పుడు అవి నాతో మాట్లాడడానికి ప్రయత్నిస్తాయి. "మాకు చాలా ఆకలిగా, దాహంగా ఉంది. సరయిన పోషణ లేదు. దయచేసి మాకు నీరుపోయండి" అని చెపుతాయి. నేను వెంటనే తోటమాలిని పిలిచి ఆ చెట్టుకు ఎరువు వేయించి, నీరు పెట్టించేవాడిని. అప్పుడు వృక్షాలు చిన్న మొక్కలు చాలా తృప్తి చెందేవి. వృక్షాలు, మొక్కలు బాగా పోషణ జరిగినప్పుడు సంతోషాన్ని వ్యక్తపరస్తూ తలలాడిస్తూ, కొమ్మల నుండి చల్లని గాలిని ఇచ్చేవి.

నేను వృక్షాల క్రింద నుండి నడిచేటప్పుడు, వాటి చల్లని నీడలోవెళుతున్నప్పుడు అవి తమ ఆత్మలను ఆవిష్కరిస్తున్నట్లుగా ఒకటి రెండు పూలు నా తల మీద పడి, స్నేహపూర్వకంగా నన్ను పలకరిస్తుండేవి. నెమ్మదిగా, ఆధ్యాత్మికంగా స్పృశిస్తూ అవి ఎవ్వరినయినా ఆహ్లాదపరస్తూ, ఆనందపెడుతుంటాయి.

ఆశ్రమములోని సభ్యులందరూ నా రాక గురించి తెలుసుకుని చాలా తొందరగా చెట్లను శుభ్రం చేసి నీరు పెట్టటానికి ప్రయత్నం చేసినప్పటికి వారు పూర్తిగా విఫలమయ్యారు. చాలా వరకు చెట్లు ఎండిపోయి ఆకులు రాల్చివేశాయి. వాటికి సరయిన పోషణ, నీరు లేదు. కొన్ని పూర్తిగా ఎండిపోయాయి. మరికొన్ని కొద్దిగా వాడిపోయాయి. ఎక్కడ చూచినా పిచ్చి మొక్కలు, కలుపు మొక్కలు పెరిగిపోయాయి. వాటిని నిర్లక్ష్యంగా వదిలివేశారు. ఆ వృక్షాలు, పొదలు అలాగే ప్రాణాలు నిలబెట్టుకొని నా రాక కోసం ఎదురు చూస్తున్నట్లుగా ఉన్నాయి. "మీరు మమ్మల్ని చంపలేరు. మీరు మమ్మల్ని ఎంతగా నిర్లక్ష్యం చేసినప్పటికి మమ్మల్ని భూమిలో నాటిన మా ప్రియమైన స్వామీజిని చూచేటంతవరకూ మేము జీవించే ఉంటాము. ఆయన మమ్మల్ని ఎంతగానో ప్రేమిస్తారు" అని చెపుతున్నట్లు ఉన్నాయి.

అలా ఆ వృక్షాలు ఎంతో కష్టం మీద పోరాడి జీవించి ఉన్నాయి. నేను వచ్చిన వెంటనే వాటికి నీరు పెట్టించి, పాదులు తవ్వించి, ఎరువు వేయించాను. ఎండిపోయిన కొమ్మలను తీసివేయించాను. మొక్కలను కత్తిరించాను. నా హృదయం చాలా బాధపడింది. ఆ విధంగా చేస్తున్నప్పుడు. కాని సర్జను రోగి భవిష్యత్తును గురించి తప్పనిసరిగా ఆపరేషన్ చేస్తాడు.

తరుచుగా నేను ఆ పొదరిళ్ళ దగ్గరికి వెళ్ళి కొమ్మలు కత్తిరించిన చోట నెమ్మదిగా నిమిరి “నన్ను క్షమించు, నిన్ను బాధ పెట్టినందుకు. కాని అది నేను నీ మేలు గురించే చేశాను. కొద్దిరోజుల్లోనే మళ్ళీ నీవు చక్కగా అందంగా పెరుగుతావు” అని వాటిని ప్రేమతో ఓదార్చేవాడిని. నేను కూడా ఉపశమనం పొందేవాడిని.

శాంతి ఆశ్రమము ఒకప్పుడు దట్టమయిన కీకారణ్యంలా ఉండి భయంకరమైన క్రూర మృగాలకు నిలయంగా ఉండేది. ఇప్పుడు చాలా అందమయిన ఆశ్రమంగా మారింది. చూడ ముచ్చటయిన కుటీరాలు, అందమయిన ఉద్యానవనాలు, పళ్ళ చెట్లు, పూల మొక్కలు, వైద్యశాల, వృద్ధాశ్రమము, గురుకుల విద్యాపాఠశాల మొదలైనవన్నీ ఉన్నాయి. చాలా అందమయిన కలలాగా ఉంది. ఇంకా పటిష్టమైన భవనాలు నిర్మించవలసి ఉంది. పెద్ద వంటశాల, సాధువులు, భక్తులు, పనివాళ్ళు ఆశ్రమానికి క్రమం తప్పకుండా వచ్చే గృహస్థ భక్తుల నివాసము కోసం మంచి భవనాలు నిర్మించాలి.

భగవంతుడు చాలా మంచివాడు! ఇదంతా నా ఒక్కడి వల్ల సాధ్యపడుతుందా! వెయ్యిసార్లు ఆలోచించినా సాధ్యంకాదు. ఈశ్వరుడి సంకల్పం లేనిచో గడ్డిపోచ కూడా కదలదు. ఈశ్వరుడే అందరికి తండ్రి, ఈ సృష్టికి కర్త. ఆయన తలుచుకుంటే ఏమయినా చేయగలడు. వైభవమంతా ఈశ్వరుడిదే. మనము ఈశ్వరుడి చేతిలో వాడబడే పనిముట్ల వంటి వారము. సూరదాసు మహనీయుని మాటలను నేను పదే పదే గుర్తు చేసుకుంటున్నాను.

“నా వంటి హేయమైన, నీతిబాహ్యమైన, పనికిమాలినవాడు ఎవరుంటారు? నేను నా గురువును ఈ సృష్టికర్తను, ఈశ్వరుడిని మర్చిపోయాను. నేను ఎంత స్వార్థపూరితమయిన నమ్మకద్రోహిని!”

ఎవరికయినా జీవితంలో జీవించి ఉండటం గొప్ప ఆశీర్వచనములాగా అనిపించే క్షణాలు ఉంటాయి. చల్లని పళ్ళ చెట్ల నీడలో కూర్చున్నాను. మామిడి, జామ, సీతాఫలము, జీడి, పనస మొదలయిన మధురమయిన ఫలాలనిచ్చే చెట్లు ఆశ్రమంలో చాలా ఉన్నాయి. వాటి నుండి చల్లని గాలులు వీస్తుంటే నేను ఎంతో సంతోషంగా, సంతృప్తిగా భావిస్తాను. ఆ పరమాత్మ దివ్యానుభూతి కలుగుతుంది.



ప్రతి వృక్షములోనూ నాకు ఆయన దర్శనమిస్తాడు. ప్రతి ఆకులో ఆయనే కనిపిస్తాడు. కొన్ని మిలియన్ల గొంతులతో ఆయన నాతో మాట్లాడుతాడు. తనను నమ్ముకున్న తన బిడ్డలపై ఈశ్వరుడికి అవ్యాజమయిన ప్రేమ ఉంటుంది. నా ఆశ్రమంలో అందమైన ఆ వృక్షాల ఛాయలో కూర్చుని ఈశ్వరుని దివ్యానుభవాన్ని నెమరువేసుకుంటూ పారవశ్యంలో మునిగిపోయాను. తెలియకుండానే నా నోటి వెంట “భగవాన్! ఇప్పుడు నన్ను ఏమి చేయమని ఆదేశిస్తున్నావు?” అని గొణిగాను. ఆ చల్లని గాలుల్లో ఆయన గొంతు ఇలా సమాధానమిచ్చింది. “నా బిడ్డా! నీవు ఏమి చేయవలసిన పనిలేదు. నిరంతరము మార్పు చెందే ఈ అనిత్యమయిన ప్రపంచంలో నీవు ఏమి చేయాలని నేను కోరుకోవటం లేదు. ఏమి లేకుండా ఉండు అదే నేను ఇప్పుడూ.. ఎల్లప్పుడూ ఇచ్చే సందేశము”.

దీనిని వింటే ప్రతి మానవుడికి ఈ సందేశము ఆత్మను మేల్కొలుపుతుంది. అదే మానవుని జీవిత గమ్యము, జన్మహక్కు అని గ్రహించాలి. ఆ నిర్వికాస్థితిలో నేను గాఢమయిన శాంతిని పొందాను. అదే పూర్ణత్వము అని గ్రహించాను. అలాంటి నిర్వికల్పస్థితి నిత్యమయినది, సత్యమయినది, అంతటా ఆవరించుకుని ఉండేది. మన శరీరములోని ప్రతి కణములోనూ, విశ్వమంతటా నిండి ఉండేది అయిన అద్వితీయ బ్రహ్మము అదే. నేను అమెరికాలో నివసించినా, భారతదేశంలో ఉన్నా శాంతి నా జీవిత లక్ష్యము. అంతకు మించి ఇంకేమీ లేదు.

మంచి ఆత్మానుభవంతో ఆశీర్వదించబడిన మహోన్నత స్థితిని పొందిన మహనీయుడు తన విశ్వ ప్రేమ వలన తన శత్రువును, చెడ్డవాడిని కూడా ప్రేమించ గల్గుతాడు. అతని విశ్వాసపూరితమయిన మతములో అందరికి స్థానము ఉంటుంది. ఎవ్వరిని వదులుకోడు. అలాంటి వ్యక్తి అన్ని బంధనాల నుండి విముక్తి పొందుతాడు. అందరికన్నా గొప్పవాడననే అహంకారము నుండి, మత చాంధసాల నుండి పూర్తిగా విముక్తి పొందుతాడు. అతనికి తరతమ బేధాలుండవు. కులమతాలకు అతీతంగా ఉంటాడు. మతము పట్ల ఏర్పరుచుకున్న అనాలోచితమయిన భావాలు, అభిప్రాయాలు, నిర్హేతుకమయిన మానసిక దృక్పథం నుండి విడుదల పొందుతాడు. అతను అందరికి **సోదరుడిలాగా, మూగ జీవాలకు కూడా స్నేహితుడిలాగా ఉంటాడు.**

**విశాలమయిన ఈ ప్రపంచమే అతని గృహము. ఈ ప్రపంచములోని వారందరూ అతనికి సోదరసోదరీమణులు. అందరినీ ప్రేమించి, ప్రతి ఒక్కరికి సేవలందిస్తాడు.** అదే అతని విశ్వమతానికి ఆలంబన. అతని వ్యక్తిగత అనుభవం తెలియచేసేది ఏమిటంటే ఎక్కడ యుద్ధ వాతావరణము కల్గించే వ్యక్తులుంటారో అక్కడ మానవుడు కష్టాలు అనుభవిస్తాడు. ఎక్కడ మంచి వ్యక్తులు ఉంటారో అక్కడ ప్రజలు సంతోషంగా, ఆనందంగా, సౌకర్యంగా జీవిస్తారు. అతను ప్రపంచమంతా అందరిలో ఎలాంటి పరిస్థితుల్లో అయినా కలిసిమెలిసి జీవిస్తాడు. ఏ వ్యక్తికి ఆధ్యాత్మిక అత్యానుభవం ఉంటుందో అతను నిర్భయంగా అడవిలోని సింహరాజులాగా జీవిస్తాడు. అతను అణుబాంబులకు కూడా భయపడడు. అతని అనుభవము ఆత్మశక్తి మీద ఆత్మానుభూతి మీద సహస్ర సూర్యకాంతితో వెలుగొందుతూ ఉంటుంది.

"ఆత్మానుభవము పొందిన మహనీయుల వలన దేశాలన్నీ ఐక్యతతో, సామరస్యంతో కలిసి మెలిసి ఉంటాయి. అందువలన మానవులు దేవునిలో జీవించాలి" అన్న మాటల్లో ఎంతో సత్యము దాగి ఉంది. సాధు మహాత్ముల జీవితాలు భగవంతునికి అంకితమయిపోతాయి. అలాగే భగవంతుని బిడ్డలకి సేవలు చేసేవారు శాశ్వతంగా భగవంతునితో కలిసి జీవిస్తారు. అది యావత్ప్రపంచానికి ఎంతో గొప్ప ఆదర్శంగా, మార్గదర్శకంగా, ఆశీర్వచనంగా ఉంటుంది. అనాదికాలం నుండి సాధు మహాత్ములు రాజులకు ప్రబోధాలు చేసి వారి జీవితాలను ప్రభావితం చేసి గొప్ప మహోన్నతమయిన ధర్మ నిర్ణయాలు తీసుకునేవిధంగా తయారు చేస్తున్నారు.

ఎప్పుడయితే ఈ ప్రపంచము కష్టాలు, రోగాలు, పేదరికము, భయము, బాధలు, ఇబ్బందులు గల్గి, అస్తవ్యస్తంగా ఉంటుందో దానికి సాధు మహాత్ములు కూడా కొంద బాధ్యత వహించాల్సి ఉంటుంది. లేదా ఈ ప్రపంచంలో ఆనందం, శాంతి సామరస్యాలు, శక్తి, పురోగతి, నిర్భయత్వము, ఆహ్లాదము నెలకొంటాయో అప్పుడు కూడా అది సాధు మహాత్ముల చేతుల్లోనే ఉంటుంది. అంతములేని, అమరమైన, శాశ్వతమైన విడదీయరాని విశ్వ సంబంధమైన క్రాంతి యొక్క అనుభవము పొందేవరకూ మౌనంగా, నిశ్శబద్దంగా ఉంటూ తన హక్కును నిగ్రహించగల సాధువు చాలా మహనీయుడు. ఆత్మానుభవము లేని వ్యక్తి



ప్రపంచశాంతికి భంగం కలిగిస్తాడు. నూతిలో కప్పలాగా తన పరిమితమయిన జీవితమే చాలా గొప్పదని ప్రపంచానికి చాటి చెప్పటానికి తాపత్రయపడతాడు. అలాంటి వాళ్ళను చూచి నేను ఎప్పుడు జాలిపడుతుంటాను. మతాలను, దేశాలను పోల్చి చూచే స్వభావము. ప్రతి దానిని తప్పుపట్లే స్వభావము సరయినది కాదు. సరయిన అవగాహనతో, శాంతితో, మంచి స్వభావంతో ప్రతి మతములోని గొప్పతనాన్ని, ప్రతి దేశములోని ప్రత్యేకతను చూడటం నేర్చుకోవాలి. సూర్యుడికుండే అన్ని కిరణాలు ప్రసరిస్తుంటాయి. అదే విధంగా అన్ని మతాల గమ్యము ఒక్కటే. ఒక్కడే దైవము. అతడే ప్రేమ, శాంతి. ఏ ఒక్క మతము కూడా తాను అందరికన్నా ఇతర మతాలన్నింటికన్నా గొప్ప అని చెప్పకూడదు.

వ్యక్తిగతమయిన అనుభవము మనకు భగవంతుని గురించి అవగాహన ఏర్పడినప్పుడు ఈ ప్రపంచమంతా వ్యాపించిపోయిన, చొచ్చుకుపోయిన, హృదయాంత గ్గతమయిన ఈశ్వరుని ఉనికిని మనము అనుభూతి చెందగల్గుతాము. అప్పుడు మనకు తూర్పు పడమరల వ్యత్యాసముండదు. ఉన్నది ఒక్కటే తత్త్వము. అది అంతటా కంటికి కనిపించకుండా వ్యాప్తమయి ఉంది. అన్ని మతాలు, దేశాలు ఆ తేజస్సు యొక్క కాంతి రేఖలే. సముద్రము తనలోనే పుట్టిన అలలు ఒకదానితో ఒకటి పోటీపడినప్పుడు నవ్వుకుంటుంది. ఒక అల సముద్రపు అడుగు నుండి ఉవ్వెత్తున ఎగిసిపడి "నేనే అన్నింటికన్నా పెద్ద అలని, నేను అందరికన్నా గొప్పదానిని, మిగిలిన అలలకన్నా నేను భిన్నం" అనుకుంటుంది. పొగరుమోతు తనంతో, అహంకారంతో ఎగిసిపడే అల ఎంత ఎత్తుకు ఎగిసినా, కొన్ని క్షణాల్లోనే విరిగిపడి కనుమరుగు అయిపోతుంది. మన కళ్ళ ముందే ఉనికి లేకుండా పోతుంది. అలలు సముద్రం కన్నా వేరు కాదు. ఏ ఒక్క అల మిగిలిన అలల కంటే వేరుగా లేదు. ఏ అలకి ప్రత్యేకత లేదు. తూర్పుదేశంలో అయినా, పశ్చిమదేశంలో అయినా సముద్రం ఒక్కటే. అలలన్నీ సముద్రము లోనివే. వాటికి ఎలాంటి ప్రత్యేకతా లేదు. అందరి రక్తము ఎర్రగానే ఉంటుంది. సముద్రములోని నీరంతా ఉప్పగానే ఉంటుంది. సముద్రములోని నీరంతా ఒక్కటే. సముద్రములోపలా, బయటా చుట్టూ నీరు అంతా ఒక్కటే.

మానవుని క్షణికమయిన జీవితము కూడా సముద్రములోని అలల వంటిదే. ఈ శరీరము అనిత్యమయినది. 'నాది, నేను, నీది' అనే వ్యత్యాసాలు అన్నీ మనము కల్పించుకున్నవే. ఈ విశ్వమంతా ఒక్కటే. మనది వసుధైక కుటుంబము. మనలో మనకు ఇన్ని తేడాలు, భిన్నత్వము, తెగలు, జాతులు, మతాలు, దేశాలు అవసరమా? అన్ని బేధభావాలను సమూలంగా పెకిలించివేసి కాల్చి బూడిద చేసివేయాలి. వ్యక్తిగత ప్రేమ, వైభవోపేతమైన అంతములేని అంతర్జ్యోతి అనే అగ్నిలో అన్ని బేధాలను కాల్చివేయాలి.

మహత్తరమైన మౌనములో సాధు మహాత్ములు ఆత్మదర్శనం పొంది సఖ్యతను అవగాహనని పెంపొందించగలుగుతారు. వారు తమ ప్రతి శ్వాస ద్వారా శాంతిని లోకానికి ప్రసాదిస్తారు. సత్యము అదే అయి ఉండగా, గొప్పమతము అదే అయి ఉండగా ఇంక మతము, దేశము పేరులో బేధాలు, అల్లకల్లోలాలు సృష్టించడానికి అవకాశం ఎక్కడుంది? అవసరాలు ఒక్కటే అయినప్పుడు మన వ్యక్తిగత అనుభవం ద్వారా మనలను మనము గుర్తించాలి తప్ప బేధభావంతో కాదు.

'ఈశావాస్యం ఇదం సర్వం' ఈ విశ్వమంతా ఈశ్వరునితో నిండిఉంది. అంతటా భగవన్మయమే. ప్రతి వ్యక్తి భగవంతుని ప్రతిరూపమే. ఆ పరమాత్మ అందరి కళ్ళలో వెలుగు నింపుతున్నాడు. ప్రతి గుండె చప్పుడులో స్పందిస్తున్నాడు. అందరి శ్వాసను ఏకం చేస్తూ దానిని విశ్వ శ్వాసగా 'సోహం'గా మారుస్తున్నాడు. ఒక్కటే జ్యోతి అయిన సత్యము, వాస్తవము ప్రతి వ్యక్తి జీవకణములోను నిండి ఉంది. అంతేకాదు విశ్వమంతా అణువు నుండి అతిపెద్ద గ్రహము దాకా అదే సత్యము ఒక్కటై ఉంది.

ప్రతి శాంతి అన్వేషకుడు తూర్పు పశ్చిమ దేశాల వారందరూ ఈ భూమి మీద శాంతి సౌభాగ్యాలను, దేశాల మధ్య ఐక్యతను, వారి వ్యక్తిగత అనుభవం ద్వారా, విశ్వ ప్రేమ ద్వారా, మహోన్నతమయిన మౌనము ద్వారా, ఎన్నటికి తరగని శాంతిని అందించాలని ఈ ఓంకార్ స్వామీజీ ప్రార్థిస్తున్నాడు.

హరిః ఓం తత్సత్



# జగద్గురు నానక్ దేవ్

**- కాటూరు రవీంద్రత్రివిక్రమ్**

విశ్వమానవ సంక్షేమాన్ని ఆకాంక్షిస్తూ అందరిపట్లా అన్నింటిపట్లా సమభావాన్ని కలిగిన మహనీయులు మహర్షిసములు. వారు కారణజన్ములు. మానవాళిని పతనం నుంచి, కలిప్రభావం నుంచి కాపాడేందుకే వారి జీవితాలు అంకితమవుతాయి. అలాంటి మహోన్నత వ్యక్తి గురునానక్‌దేవ్.

పువ్వుపుట్టగానే పరిమళిస్తుంది. 1469 సంవత్సరంలో ప్రస్తుత పాకిస్థాన్‌కు చెందిన షేక్‌నరా జిల్లా తల్వాండి గ్రామం (ప్రస్తుతం 'పున్‌కాణాసాహిబ్'')లో నానక్ జన్మించారు. బాల్యం నుంచే అసాధారణ ప్రజ్ఞ కలిగి ఉండేవారు. తాత్విక ధోరణి ఆయనకు పుట్టుకతోనే వచ్చింది.

నానక్ నిత్యం 'వెయిన్' నది (సుల్తాన్‌పూర్)లో స్నానం చేస్తుండేవారు. ఒకరోజున నదిలో మునిగిన నానక్ మూడురోజుల తరువాత బయట ప్రపంచానికి కనిపించారు. ఆయనకు దైవదర్శనం అయిందనీ, ఒక దివ్యవస్త్రాన్ని ప్రసాదించాడనీ చెబుతారు.

నానక్ తన బాల్యమిత్రుడైన మర్దానాతోపాటు విస్తృతంగా 'ఉదాసీలు' (బోధన యాత్రలు) చేశారు. యాత్రల్లో అనేకమంది ప్రజలను కలుసుకుని వారి మూఢ, అంధవిశ్వాసాలను తమ ప్రభావంతో, ఆధ్యాత్మికతర్కంతో, రుజువులతో రూపుమాపే వారు.

ఆయనది కులమతజాతులకు అతీతమైన ఆధ్యాత్మిక ధర్మం. ఏ మతాన్నీ కించపరచేవారు కాదు. సర్వధర్మ సమ్మిళితమైన దైవదర్శమే నానక్ మార్గం. గురుశిష్య సంప్రదాయం పటిష్ఠంగా అమలు జరుగుతున్న ఏకైక ధర్మమిది.

నానక్‌ని అన్ని మతాలవారు గౌరవించి, ప్రేమించారు. సిక్కు అన్న పదానికి శిష్యుడని అర్థం. గురునానక్‌దేవ్‌తో ప్రారంభమైన గురు-శిష్య సంప్రదాయం, అనంతరకాలంలో గురు అంగద్‌దేవ్‌జీ, గురు అమర్‌దాన్‌జీ, గురు రామదాన్‌జీ, గురు అర్జునదేవ్‌జీ, గురు హర్ గోవింద్‌జీ, గురు హర్‌రాయ్‌జీ, గురు హర్‌కిషన్‌జీ,

గురు తేగ్ బహదూర్‌జీ, గురు గోబింద్‌సింగ్‌జీ, గురు గ్రంథసాహిబ్‌జీ (పవిత్ర సిక్కు గ్రంథం) వరకు కొనసాగుతూ ప్రపంచంలోనే అతివిశిష్టమైన మతంగా విరాజిల్లుతోంది.

పరమాత్మ గురించి సిక్కు ధర్మం–ఇక్ ఓంకార్ (ఓంకారరూపుడైన ఆయనే సర్వేశ్వరుడు), సత్నామ్ (ఆయన పేరు సత్యానికి పర్యాయపదం), కర్తా (సర్వ సృష్టికర్త), పురుఖ్ (తన సృష్టిలో స్వతస్సిద్ధంగా తన అంశగల వాడు), నిర్భవు (భయరహితుడు), నిర్వైరు (క్రోధవిరోధాలు లేనివాడు) అకాల్ మూరత్ (కాలాతీతుడు, శాశ్వతుడు), మూరత్ (అవసరార్థం రూపం ధరించేవాడు), అజూని (చావుపుట్టుకలు లేనివాడు), సైభంగ్ (స్వయం జ్యోతి), గురుప్రసాద్ (గురువుద్వారా అనుగ్రహించేవాడు) అని విలక్షణమైన నిర్వచనాలు ఇచ్చింది. సిక్కులు ముందుగా తమ ప్రార్థనలో ఈ పలుకులే పలుకుతారు.

గురుసాక్షాత్ పరబ్రహ్మ గనుక, సిక్కులు 'వాహెగురు' మంత్రంతో పరమాత్మను ఆరాధిస్తారు. సిక్కులు ప్రతిరోజూ జవ్‌జీసాహిబ్, జావ్ సాహిబ్, సవయ్యేపది సుధాస్వయ్యలు – ఉదయం పఠిస్తారు. సిక్కు ధర్మానికి అయిదు ఆధ్యాత్మిక శిఖరాల నదగిన సింహాసనాలు (తఖ్తులు) ఉన్నాయి. వీటినే ఆకాల్‌తఖ్త్‌సాహిబ్, హర్‌మందిర్ సాహిబ్, కేష్‌ఘడ్ సాహిబ్, దమ్‌దమాసాహిబ్, హుజుర్‌సాహిబ్ అంటారు. ఇవి పంజాబ్, బీహర్, మహారాష్ట్రల్లో ఉన్నాయి. తమ గురువులకు సంబంధించిన ముఖ్య దినాలే, సిక్కులకు పండుగలు. ముఖ్యంగా జన్మదినాలు, గురుపీఠమలంకిరించిన రోజులు, ప్రాణత్యాగంతో పరమాత్మతతో విలీనమైన రోజులవి.

గురునానక్‌దేవ్ తరువాత వచ్చిన గురువులందర్నీ ఆయన తాలూకు జ్యోతి స్వరూపంగానే భావిస్తారు. గురుగ్రంథసాహిబ్‌లో అన్ని ప్రముఖ మతాల సూక్తులున్నాయి. అందువల్ల అది జగత్తుకు మార్గదీపం. ఇంతటి గొప్ప ధర్మస్థాపకుడు నానక్‌దేవ్ జగద్గురువుగా ఆరాధ్యుడు.

(సేకరణ : ఈనాడు అంతర్యామి 13.11.2008 నుండి
వారి సౌజన్యముచే ప్రచురించబడినది)



# ఆనంద రామాయణము

**(గత సంచిక తరువాయి)** **పరిష్కర్త : స్వామి సత్యాత్మానంద**

విల్లునెక్కుపెట్టే ఆలోచననుకూడా ఎవ్వరూ చేయలేకపోయారు. ఇట్లు ధనస్సు నెక్కుపెట్టుటలో అందరూ విముఖులైయుండుట గమనించిన (68) మహాగర్విష్ఠియైన రావణుడు ఆ శివధనస్సువద్దకు వచ్చి నవ్వుచూ, సభలోని జనకునితో (69) "ఎవనిచేత దేవతలు జయించబడిరో, ఎవ్వడు ముల్లోకములను వశపరచుకొనెనో, ఎవడు కైలాసపర్వతమును తనచేతులతో అల్లాడించెనో, (70) అట్టి నా బలమును ఈ సభలో, గడ్డిపరకవంటి ఈ అల్పధనస్సుముందు చూడదలచెదవా?" (71) అని చెప్పుచూ వంగి, ఆ మహాధనస్సును తన యెడమచేతితో కదిలించుటకు ప్రయత్నించెను. (72) అది ఇసుమంతైనను కదలలేదు. కుడిచేతితో ప్రయత్నించెను. అయినను కదలలేదు. (73) ఆశ్చర్యముతో భుజములతోను ఎత్తబూనెను.

**ఏకోనవింశద్దోర్భిశ్చ ధృత్వా చైవ మహద్ధనుః ।**
**గుణం భూమ్యాం నిపతితం గృహీతుం హి దశాననః ॥ 75**

**కించిద్భూత్వావినమ్రః స్వ దోష్ణా జగ్రాహ తం గుణమ్ ।**
**ఏతస్మిన్నంతరే తచ్చ పపాత తద్ధృయేధనుః ॥ 76**

**న తద్వింశత్ భుజాభిశ్చ చచాల హృదయాద్ధనుః ।**
**తదా సభాయామూర్ధ్వాస్యః పపాత స దశాననః ॥ 77**

**ముకుటః పతితో భూమౌ ముక్తకచ్ఛోప్యభూత్తదా ।**
**తదా విజహసుః సర్వే సభాయాం పార్థివోత్తమాః ॥ 78**

**తదా ప్రాణాంతికం చాసీత్ రావణస్య సభాంగణే ।**
**అక్షిణీ భ్రామయామాస లాలాస్తేభ్యో వినిర్యయౌ॥ 79**

**తదా తం వేష్టయామాసుః మంత్రిణో రాక్షసాస్తదా ।**
**ధనురుచ్చాళనే శక్తాస్తేఽ భవన్నైవ సంసది ॥ 80**

**సహస్రేషు దశాస్య స్వ విష్టామూత్రం తదాఽ కరోత్ ।**
**తత స్సభాయాం జనకః పునః ప్రాహాతిశంకితః ॥ 81**

**కోఽ పి వీరోఽ స్తి భూమౌ న కిం నిర్వీరం హి భూతలమ్ ।**
**చేదస్తి కశ్చిత్సదసి తర్హి సోఽ ద్య సభాంగణే ॥ 82**

జీవదానం కరోత్వస్మై దశాశ్యాయ నృపాగ్రతః ।
ఇతి వాక్యశరాఘాతభిన్నౌ తౌ రామలక్ష్మణౌ ॥ 83

దదర్శతుర్గాధిజస్య ముఖం తౌ స్ఫురితభ్రువౌ ।
విశ్వామిత్రస్తదా ప్రాహ రామ చోత్తిష్ఠ రాఘవ ॥ 84

కిమంతం రావణస్యాద్య త్వం పశ్యసి సభాంగణే ।
జీవయైనం రాక్షసేంద్రం సజ్జం కురు ధనుస్త్విదమ్ ॥ 85

తన్మునేర్వచనం శ్రుత్వా తథేత్యుక్త్వా స రాఘవ ః ।
తదోత్థాయాసనాద్వేగాత్ ప్రణనామ మునీశ్వరమ్ ॥ 86

నిష్క్రాస్యకంఠాద్ధారాదీన్ కటిం బద్ధ్వా తదా ప్రభుః ।
ముకుటాది దృఢం కృత్వా శనైః ప్రాప సభాంగణమ్ ॥ 87

తం రామమాగతం దృష్ట్వా జనా స్సర్వేఽః తివిస్మితాః ।
చికితాః పార్థివా స్సర్వే దదృశుర్నేత్రపంకజైః ॥ 88

ఈ విధముగా అన్ని భుజములతోను పెకలింపబూనెను. చివరకు తన ఇరవై చేతులతో ప్రయత్నించి ఆ ధనువు ఒక్క భాగము లేపగలిగెను. (75) పంతొమ్మిది చేతులతో దానినట్లే నిలిపి, ఇరవైయ్యవ చేతితో భూమిపై ఉన్న అల్లెత్రాటిని తీసుకొనుటకు వంగగా, (76) ఆ ధనస్సు గుండెలమీద పడెను. (77) క్రిందబడి కిచకిచ లాడుచూ, తన ఇరువది చేతులతో ఆ ధనస్సునెత్తడానికి ప్రయత్నించినా ఫలితములేక పై చూపులు చూచుచు నేలపైబడెను. (78) పంచకట్టు వీడిపోయెను, కిరీటము తొలగిపోయెను. సభలో రాజులందరును పకపకలాడిరి. (79) అపుడు రావణునికి ప్రాణాంతక మనబడెను. కండ్లు గిరగిరలాడెను. నోట చొంగకారెను. (80) అపుడు అతని మంత్రులు, పరివార రాక్షసులు చుట్టూ చేరిరి. అందరును ధనస్సును ఎత్తుటకు చేతగాక నిర్విణ్ణులైరి (81) వేలాది రాజుల నడుమ రావణుడు మూత్రము కార్చెను. అపుడు జనకుడు మిక్కిలి శంకించుచు ఇట్లనెను. (82) "భూమి పై ఒకవీరుడైనా లేదా? ఈ భూతలమే నిర్వీర్యమాయెనా? వీరుడిండినచో! ఈ సభా మధ్యమున, (83) ఈ దశకంఠునికి ఈ రాజులమధ్యన ప్రాణదానము చేయు గాక!' (84) ఆ జనక వాక్యమును విన్న రామలక్ష్మణులిరువురు కనుబొమ్మలదరు చుండ, విశ్వామిత్రునివైపు చూచిరి. అపుడు విశ్వామిత్రుడు, "రఘువీరా! లెమ్ము



(85) నీ విపుడిచట రావణుని మరణముచూచెదవా? ఈ సభామధ్యమున రాక్షసేంద్రుని బ్రతికింపుము. ఈ ధనస్సును ఎక్కుపెట్టుము". అనెను. (86) శ్రీరాముడు ఆ ముని వాక్యమును విని, అట్లేయని వెంటనే లేచి, మునీశ్వరునికి నమస్కరించి, (87) మెడలో హారాదులను సవరించుకుని, నడుముకట్టి, కిరీటాదులను సవరించుకుని, సభాంగణమునకు నేరుగవెడలెను. (88)

పరస్పరం తదా ప్రోచుః కింమూఢోఽప్తి శిశుస్త్వయమ్ ।
యత్రాస్మాభిః స్థితం తూష్ణీం తత్రాయం కిం కరిస్యతి ॥ 89

కేచిదాహుర్దశాస్యం హి ద్రష్టుం బాల స్సమాగతః ।
కేచిదూచుర్బాలచేష్టా క్రియతే శిశువాఽత్ర హి ॥ 90

కేచిదూచుః కిమర్థం హి హారా ముక్తాస్త్వనేన హి ।
కేచిదూచుర్గాధిజేన చాపం ప్రతి మయోజితః ॥ 91

కేచిదూచుర్వైరబుద్ధ్వా చోదితః కిం శిశుస్త్వయమ్ ।
వధార్థం చాపఘాతేన విశ్వామిత్రేణ రాఘవః ॥ 92

కేచిదూచుర్బలం త్వస్య మునినాఽత్ర నిరీక్షితుమ్ ।
చోదితోఽస్త్వత్ర శ్రీరామాశ్చాపేఽయం కిం కరిష్యతి ॥ 93

ఏవం నానావిధాస్తర్కా న్యావత్కుర్వంతి పార్థివాః ।
తావద్దృష్ట్వాగ్రతో రామం జనకః ప్రాహ గాధిజమ్ ॥ 94

కిమర్థం ప్రేషితస్త్వత్ర మునే బాల స్సభాంగణే ।
అత్రైతే రావణాద్యాశ్చ నృపాః సర్వేతి కుంఠితాః ॥ 95

తస్మింశ్చాపే త్వయం బాలః కిమాగత్య కరిష్యతి ।
యత్త్వయా శిష్యవాక్యేన పూర్వం చాహం ప్రబోధితః ॥ 96

తత్సర్వం తు మృషైవాద్య చాపాగ్రే మునిసత్తమ ।
కాయం బాలః కోమలాంగః క్వేదం చాపం సుదుర్ధరమ్ ॥ 97

కిం చాతకస్తృషాక్రాంతః సాగరం శోషయిష్యతి ।
ఏతస్మిన్నంతరే సర్వాః సుమేధాద్యాః స్త్రియశ్చ తాః ॥ 98

ద్విజరాజానన చారుదోర్దండద్వయశోభితమ్ ।
హేమవర్ణోపమరుచిం శృంఖలానూపరాంఘ్రిణమ్ ॥ 99

**శృంఖలాకంకణవరద్వయంశోభితసత్కరమ్ ।**
**దివ్యకుండలమకుటరత్నాలంకారశోభితమ్ ॥** **100**
**సుజంఘం సువదం శూరం సుజానుం సుందరోదరమ్ ।**
**సుస్కంధం సుహనుం కంబుకంఠం త్రివళిశోభితమ్ ॥** **101**
**స్మితాస్యం కోమలోష్ఠం చ సుదంతావళిరంజితమ్ ।**
**సునాసం సుకపోలం చ కంజపత్రాయితేక్షణమ్ ॥** **102**

ఆ రామమూర్తిని జూచి, జనులందరూ ఆశ్యర్యమొందిరి. రాజులంతా చకితులై కనుదామరలతోజూచి, ఒకరితోనొకరిట్లనుకొనిరి. (89) ఈ బాలుడేమైనా మూఢుడా? ఏ విషయమున మనందరమూ ఊరుకున్నామో? ఆ విషయమున ఇతడేమి చేయగలడు? (90) కొందరు, "ఈ బాలుడు రావణునిజూచుటకు వచ్చుచున్నా"డనిరి. (91) మరికొందరు "ఇతడు కంఠహారాదులనేల తీసిపెట్టె?"ననిరి కొందరు (92) "ఈ ముని ఇతనిని పగతో ఈ పనికి పురికొల్పె"ననిరి. (93) ఇంకొందరు "ఇతని బలమును పరీక్షించుటకు విశ్వామిత్రుడు పంపెనుగాని, ధనస్సు నితడేమి చేయగల" డనిరి. (94) ఇట్లు రాజులు నానావిధములుగా వితర్కించుచుండగా, జనకుడు మొదట రామునిజూచి, విశ్వామిత్రునితో ఇట్లనెను. (95) "మునిపుంగవా! ఈ బాలకునేల పంపితిరి? రావణాదిరాజులు ఏ విశ్వామిత్రునితో ఇట్లనును. (95) "మునిపుంగవా! ఈ బాలకునేల పంపితిరి? రావణాదిరాజులు ఏ ధనస్సునెత్తుటకు దుర్బలులైరో! (96) అట్టి ధనస్సును ఈ బాలుడేమిచేయగలడు? (97) మునుపు శిష్యునిద్వారా నాకు తెలిపినదంతయు ఈ ధనస్సుముందు నిజమగునా?! కోమలుడగు ఈ బాలుడెక్కడ? దుర్ధరమైన కోదండమెక్కడ? (98) చాతకపక్షి దప్పిగొనిన సముద్రమును శోషింపజేయగలదా? అని జనకుడు చెప్పుచుండగా, మేడలమీదనున్న సుమేధాది మంగళస్త్రీలందరూ... (99-104)

**సుభ్రూభావం చ సుస్నిగ్ధం కుంచితాళకశోభితమ్ ।**
**ముక్తామాణిక్యరత్నాది నానాలంకారశోభితమ్ ॥** **103**
**ముక్తారత్నపుష్పమాలా న్యస్తమప్యతిశోభితమ్ ।**
**న్యస్తహారం న్యస్తవస్త్రం బద్ధపీతాంబరాన్వితమ్ ॥** **104**



# గురువాచక కోవై

**మూలం : మురుగనార్** **వివరణ : సాయికృష్ణ**

## భగవదర్శనము

**'దేహమేనేను' అనెడి భ్రాంతి పూర్తిగా నశించి క్లేశదాయకములయిన తలపుల రూపముగా గల సకలమనః కల్పనల నుండి విడివడినప్పుడు, నీవు అద్వయచిదాకాశమగు కృపాదృష్టిమాత్రముగా నిలిచియుండెదవు. ఇదే ఈశ్వరుని సంపూర్ణ దర్శనము.**

మనకు పరమాత్మ దర్శనం అంతటా ఎందుకు కావడము లేదంటే, ఈ శరీరమే నేను అనే భ్రాంతిలో ఉండడం వలన మనకు నిరంతరం ఆలోచనలు వస్తూనే ఉంటాయి. అందువలన మనకు మన స్వరూమయినటువంటి ఆత్మ, జగద్రూపంలో కనిపించెడి పరమాత్మ అనుభవానికిరావడంలేదు. నిరంతరం వచ్చే మన తలపులే మన స్వరూపాన్ని కప్పివేస్తున్నాయి. ఈ ప్రపంచాన్ని మనము పరిమితి దృష్టితో చూస్తున్నాము. కావున ఈ నామరూప ప్రపంచాన్నే గమనిస్తూ, దీని వెనకాల ఉన్న సత్యాన్ని చూడలేకపోతున్నాము. ఈ ఆలోచనల వలన మనకు దుఃఖము, బాధ, అసంతృప్తి మొదలయినవి కలుగుతాయి. ఎప్పుడయితే మనము ఈ ఆలోచనల నుండి విడివడి ఆత్మ విచారణ మొదలుపెడతామో అప్పుడు మనకంటె భిన్నము కానటువంటి పరమాత్మను అనుభవానికి తెచ్చుకుంటాము. జ్ఞానస్వరూపముగా, ఆత్మ స్వరూపముగా నిలిచిపోతాము. తనను పరమాత్మగా, ఈ సమస్త సృష్టిని పరమాత్మగా, సకలజీవరాశులను పరమాత్మగా చూడకలగడమే సంపూర్ణదృష్టి.

**వనచించెడి ఇంద్రియములను నిగ్రహించి, మనఃకల్పనలను వదలివైచి, నీవు నీ స్వస్వరూప సంస్థితుడవై తటస్థముగా నిలిచి యుండవలయును. నీవు హృచ్చైతన్య పరినిష్ఠిత ఆత్మదశాపూర్ణుడువై యున్నచో, శివస్వరూపము స్వయముగా సాక్షాత్కరించును.**

సాధకులు ఇంద్రియములను నిగ్రహించి, మనో ఆలోచలను నశింపజేసినపుడు మనస్సు ఆత్మలో నిలిచిపోతుంది. అప్పుడు అంతా పరమాత్మ స్వరూపముగా మీకు అనుభవానికి వస్తుంది. మనస్సు ఎప్పుడూ వర్తమానంలో ఉండదు. భూతభవిష్యత్తులలో తిరుగుతూ ఉంటుంది. భగవంతుని ఇష్టప్రకారమే అంతా జరుగుతుందని తెలిసినా

కూడ మనస్సు గతాన్ని తవ్వుకుంటూ, భవిష్యత్తుకు బాటలు వేస్తూ ఉంటుంది. మహాత్ములందరూ కూడ చెప్పేది వర్తమానంలో ఉండమని వర్తమానములో ఉన్నప్పుడు మనస్సు పరిపూర్ణంగా నిగ్రహించబడుతుంది. వర్తమానంలో ఉన్నప్పుడు ఆలోచనలు రావు. అప్పుడు మన సత్యరూపం అనుభవానికి వచ్చి తీరుతుంది. శివస్వరూప దర్శనము అవుతుంది. శివ అంటే మంగళస్వరూపము, శుభము.

**బ్రహ్మస్వరూపము యొక్క సత్య దర్శనములో అజ్ఞానవరణము ఉండదు. ఆ స్థితిలో నీవు హృదయములో, ఆనందసాగరముగా, అనుగ్రహము యొక్క వెల్లువగా ప్రకాశించెదవు. పూర్ణాత్మగా ఉప్పొంగెడి మౌనానుభవము ఊహించుటకు వీలుగానిది. ఆ స్థితిలో జీవునకు దుఃఖముగాని, అసంతుష్టి గాని లేశ మాత్రము ఉండవు.**

బ్రహ్మానుభవం కలిగినప్పుడు అజ్ఞాన ఆవరణ ఉండదు. అజ్ఞాన ఆవరణ అంటే మనః సంకల్పములు. ఇవి ఆత్మ స్వరూపాన్ని కప్పివేస్తున్నాయి. బ్రహ్మానుభవం కలిగినప్పుడు మనస్సు నశించి పోతుంది. నీ హృదయములో ఉండే ఆత్మానందము వెల్లువలా పొంగిపొర్లుతుంది. అప్పుడు మహామౌనము అనుభవమవుతుంది. బ్రహ్మ స్వరూపముగా ఉన్నప్పుడు ఆత్మలో ఆలోచనలు లేక నిశ్శబ్దముగా ఉంటుంది. ఆ స్థితిలో దుఃఖముగాని, అసంతుష్టి గాని లేక కేవలము ఆనందము మాత్రమే ఉంటుంది. ఆనందము అంటే దుఃఖ స్పర్శ ఏ మాత్రము లేనటువంటి స్థితి. ఆత్మానుభవము కలిగినప్పుడు ఆనందం ఉప్పొంగిపోతుంది. మనస్సు అజ్ఞానము వదిలేసి, జ్ఞానము కలిగిన స్థితిలో ఉంటుంది. ఆత్మ పరిపూర్ణమయిన మౌనములో ఉండి, మనస్సు యొక్క ఛాయలేశమాత్రము కూడ ఉండదు. ఆ అనుభవమును అనుభవించడమే గాని ఊహించి చెప్పడానికి మాటలు లేవు.

**హరి ఓం తత్సత్**



## దక్షిణామూర్తి స్తోత్రం

## మానసోల్లాస సహిత

**శ్రీ సురేశ్వరా చార్య** **వాఖ్యాత - వింజమూరి రాధాకృష్ణ**

ఆది శంకరుల కాలంలో మనదేశంలో ఆంగ్ల విద్య లేదు. సనాతన సంస్కృత విద్య మాత్రమే ఉండేది. అతి చిన్న వయసులోనే వారు ఉపనిషత్తులు అధ్యయనం చేశారు. అందువల్ల కనోపనిషత్, ఈశావాస్య ఉపనిషత్, తైత్త రియోపనిషత్ మున్నగు వానివల్ల 'నేనెవరు' 'కనిపించే ఈ ప్రకృతి ఏమిటి' అనే క్లిష్టమైన ప్రశ్నలకి జవాబు గురుముఖంగా లభించి చక్కని విజ్ఞాన వంతులయ్యేవారు.

కానీ నేడు మన విద్యా విధానంలో ప్రాథమిక పాఠశాలల్లో పిల్లలకి శరీర భాగాలు ఏమిటి? అదీ ఆంగ్లంలో చెపుతున్నాము. అలాగే తన చుట్టూ ఉన్న పరిసరాలను గూర్చి పరిసరాల విజ్ఞానం-1, పరిసరాల విజ్ఞానం-2 అనే విభాగాలుగా 'అహం' 'ఇదం' భావాలను బాహ్యదృష్టితోనే చూస్తున్నాము, చెప్తున్నాము కూడా.

ఈ సందర్భంగా దక్షిణామూర్తి స్తోత్రంలోని ఈ మొదటి శ్లోకంలో మన చుట్టూతా ఉండే ప్రకృతి గూర్చి తాత్విక పద్ధతిలో చర్చకొనసాగినది. శంకరులు 'బ్రహ్మ సత్యం జగత్ మిధ్య' అన్నారే గాని, బ్రహ్మ సత్యం జగత్ అసత్ అనలేదు.

ఇందుకు సరిపోయేలా మనం చూచే విశ్వాన్ని అద్దంలో చూచే ప్రతిబింబంగా పోల్చిచెప్పారు. అద్దంలో మనం చూచే మన ముఖం పూర్తిగా సహజము అని అనలేము అలాగని అసత్యము అనీ అనలేము. కానీ అసలైన సహజ వస్తువు లేనప్పుడు అద్దంలో ప్రతిబంబము ఉండదు. అట్లని ముఖాన్ని మనం అద్దం పక్కకి పెట్టినప్పుడు అద్దంలో ముఖం కూడా మాయమగును.

విశ్వం అద్దంలో కనిపించే ప్రతిబింబం అయితే అసలు సహజమైన నిజ విశ్వం ఎక్కడుంది? అనే ప్రశ్న ఉదయిస్తుంది. ఇందుకు సమాధానమే శంకరులు వాడిన పదం 'నిజాంతర్గతం' దీని భావం అసలు నిజమైన విశ్వం మన అంతరంగంలో ఉన్నది. మనం సినిమా చూసేటప్పుడు తెరపై కనిపించే బొమ్మలు ప్రతిబింబమే కానీ సహజము కాదు. సినిమా హాలు క్యాబిన్ రూములో నుండి ఫిల్మ్ పై పడిన కాంతి వల్ల తెరపై బొమ్మ కనిపిస్తోంది. అట్లే మన అంతరంగంలోని ఆత్మ 'మాయ' అనే ప్రకాశం ద్వారా బయటకు ప్రసారం చేస్తున్నదే ఈ కనిపించే విశ్వం అంతా. ఈ

భావాన్ని తిరస్కరించడానికి వీలు లేకుండా శంకరులు మాండుక్యోపనిషత్‌లోని మూడవ మంత్రంలో చెప్పబడిన 'తేజస్' ఆధారంగా 'యథా నిద్రయా' అనే పదం ఉపయోగించారు. ఇది నిజమే ఎన్నో కలలుకంటుంటాము. ఉదాహరణకు రైలు ఎక్కినట్లు కోయంబత్తూరులో దిగి కారులో కోటగిరిలోని శాంతి ఆశ్రమం వెళ్లినట్లు కల వచ్చింది అనుకుందాము. కల నుంచి మెలకువరాగానే మనం ఉన్న గది తప్ప యే మీ కానరాదు. రైలు, కోయంబత్తూరు, కారు, కోటగిరి ఆశ్రమం అన్ని ఏమయాయి. బయట ఉన్నట్లు చూసాము కదా! కానీ కొద్దిసేపట్లోనే అంతానాలోనే జరిగింది అని గ్రహిస్తాము. అంటే నీ ఆత్మ వీటన్నిటినీ నిజమేమో అని భ్రమ కలిగేలా చేసింది. అలాగే మెలకువగా ఉన్నప్పుడు మాండుక్యంలోని మూడవమంత్రంలోని "సప్తాంగ ఏకోన వింశతిమ్ముఖమ్" అన్నీ బాహ్య అంతరంగ భాగాలు చురుకుగా ఉండి విశ్వానరుడుగా ఉన్నప్పుడు, అనగా మనం మెలకువగా ఉండి అన్ని పనులు చేస్తున్నప్పుడు సద్గురువు ప్రభోదచే అజ్ఞానము నశించి జ్ఞానోదయం కలుగుతుంది. దీనిని ఈ శ్లోకంలో 'స్వాత్మా న మేవాధ్వయం" అనే పదం ద్వారా శంకరులు తెలిపారు. దీని వల్లనేను అహం, (నేను) ఇదం, (అవిశ్వం) తత్ (సృష్టి స్థితయ లయకారుడైన పరబ్రహ్మ) అనే త్రిపుటి భావన నశించి, 'ఏకమేవ అద్వితీయం బ్రహ్మ" అనే జ్ఞానం కలిగించ గురుమూర్తి అయిన దక్షిణామూర్తికి నమస్కారం. గురు పరంపరలో 'సదాశివ సమారంభం" అంటాము. "ప్రభోధసమయే" అన్నప్పుడు సాధకునికి ఒక గురువు అవసరము. చాందోగ్య ఉపనిషత్‌లోని 6-14-2 మంత్రం 'ఏవమే వే హచార్యవాన్ పురుషోవేద' అంటుంది. అనగా గురువు లేక ఆచార్యుడు గల సాధకుడు మాత్రమే సత్యము తెలుసుకొనగలడు.

శ్వేతా స్వర ఉపనిషత్‌లోని 6-11 మంత్రం ఇదే భావాన్ని వక్కాణించుచున్నది.

"ఏ కో దేవ: సర్వ భూతేషు గూఢ:
సర్వ వ్యాపి సర్వభూతాంతరత్మా
కర్మా ధ్యక్ష: సర్వభూతాది వాస:
సాక్షిచేతాకేవలో నిర్గుణశ్చ

ఒక్కడే అయిన భగవంతుడు అన్ని జీవులలోనూ దాగి ఉన్నాడు. అతడు సర్వ వ్యాప్తి, అన్ని ప్రాణులకు అంతర్యామి, అన్ని కర్మలను ఆయన పర్యవేక్షిస్తాడు. అన్ని



జీవాలు ఆయన యందే నివసిస్తాయి. ఆయనయే సాక్షి ప్రకృతి గుణ రహితుడైన శుద్ధ చైతన్యం.

బృహదారణ్యక ఉపనిషత్‌లోని 3-7-3 మంత్రము దీనిని సమర్ధించుచున్నది.

"య: పృది వ్యాం తిష్టన్, పృధి వ్యా అంతరోయం
పృధివీ నవేద యస్య, పృధివీ శరీరం
య: పృధివీ మన్తరో, యమయత్యే షత
ఆత్మాన్యర్యా మ్యమృత:"

"ఎవడైతే పృథ్వి యందన్న, వాడై పృథ్వి కంటే లోపలివాడో, ఎవనిని పృథ్వి తెలియకున్నదో, ఎవనికైతే పృథ్వి శరీరమో, ఎవడైతే పృథ్వి లోపలివాడై నియంత్రించు చున్నాడో, ఈ అంత్యామి నీ యొక్క ఆత్మ అమృతుడు".

భగవద్గీతలో కూడా ఇదే భావాన్ని అనేక సందర్భాలలో భగవానుడు అర్జునునికి తెలిపాడు. ఉదాహరణకి 15వ అధ్యాయంలో 14వ శ్లోకంలో

1. "అహం వైశ్యా నరో భూత్వా ప్రాణి నామ్ దేహమాశ్రితం" అనగా ఈ ప్రాణుల దేహాన్ని ఆశ్రయించి విశ్వానరుడుగా నేను ఉన్నాను.

2. అట్లే భగవద్గీతలోని 18వ అధ్యాయంలోని 61వ శ్లోకంలో"

"ఈశ్వర సర్వభూతానం హృద్దేశేఽ ర్జున! తిష్టతి
భ్రామయ సర్వభూతాని యంత్రా రూఢాని మాయయా"

"ఓ అర్జున! నేను ఈ అన్ని భూతాల శరీర యంత్రాల హృదయంలో ఉండి మాయతో వారిని భ్రమింప చేయుచున్నాడు."

3. భగవద్గీతలోనే రెండవ అధ్యాయం 16వ శ్లోకం కూడా ఇదే భావాన్ని తెలుపుతున్నది.

"నా సతో విద్యతే బావో నా భావో విద్యతే సత:
ఉ భయోరపి దృష్టోఽ న్తస్త్వనయా స్తత్త్వ దర్శిబి:

అసత్యములైన వానికి, అనగా నామరూపాలు మాత్రమే కలిగి నశించువానీ దేహములకు ఉనికి లేదు. సత్యమైన ఆత్మకు ఆ భావము గాని లేమిగానీ లేదు. ప్రత్యక్ష అనుభవం గల తాత్వికులు ఈ రెండింటి (సత్ మరియు అసత్) యొక్క నిర్ణయము బాగుగా తెలియుదురు.

సాధనలో ఉన్న అనేకమంది దక్షిణామూర్తి స్తోత్రంలో నిజంతోనే దీనిని మననం చేసి భావాలపై అచంచల విశ్వాసాన్ని కలిగి ధన్యులవుతారు.

దక్షిణామూర్తి స్తోత్రంలోని మొదటి శ్లోకాన్ని అందరూ అంగీకరించునట్లు పూర్వపక్షి విమర్శలకి జవాబుగా సురేశ్వరాచార్యులు తమ మానసొల్లాసంలో ఎనిమిదవ శ్లోకం నుండి 30వ శ్లోకం వరకు వార్తిక వ్రాసిరి. మన పరిశీలన కొనసాగిద్దాము.

అంతరస్మిన్ని మే లోక అంతర్విశ్వమిదం జగత్
బహిర్వాన్మాయ యా భాతి దర్పణేస్వ శరీరవత్

ఇ మే = ఈ, లో కా: = లోకములు అస్మిన్=ఈచైతన్యములో అంత:= లోపల ఉన్నాయి. ప ఇదం విశ్వమ్= ఈ విశ్వం, జగత్ = ప్పంచము, అంత:= లోపల ఉన్నది. దర్పణే= అద్దమందు (కనిపించే) స్వశరీరవత్ = తన శరీరము వలెనే, మాయయా బహిర్వత్=బయట ఉన్నట్లు, భాతి = అనిపించుచున్నది.

మనం బయట చూచే ఈ విశ్వము, ప్రపంచం మనకు బయట ఉన్నట్టు కనిపిస్తాయి. అందుచే అవి మన బయట ఉన్నట్లు మనం వాటిని చూస్తున్నట్లు, అవి మనచే చూడబడుతున్నట్లు భావిస్తాము. నిజానికి అవిమనఆత్మయందు ఉన్నాయి.

ఇలా అనిపించడానికి కారణం మన పంచేంద్రియాలే అని కఠోపనిషత్‌లోని 2-1-1 మంత్రము చెప్పుచున్నది.

'పరాంచి ఖాని వ్యత్పణత్ స్వయంభూ:
తస్మాత్ పరాంగ్ పశ్యతి నా అంతర్మాత న్
కశ్చధీర: ప్రత్యేగాత్మనా మైక్షత్
ఆ వృత్త చ క్షు: అమృతత్వ మిచ్ఛన్."

"పరమాత్మ ఇంద్రియాలను బహిర్ముఖంగా ఉండునట్లు బాధించాడు. అందువల్ల మానవుడు బయట విషయాలనే చూస్తాడు. అనుభవిస్తాడు. కాని లోన ఉన్న పరమాత్మను చూడలేడు. ఎవరో ఒక ప్రజ్ఞావంతుడు అమృతత్వాన్ని కోరుకున్న వాడై ఇంద్రియాలను నిగ్రహించి తనలో ఉన్న పరమాత్మను చూడగలడు".

అద్దంలో మనం ముఖం చూసుకున్నప్పుడు అద్దంలో మనం చూసేది మన ప్రతిబింబము మాత్రమే. అది సత్యము కాదు అట్లాగని అసత్యము కాదు. అది మన మిధ్యా ప్రతిబింబమే కానీ సహజము, సత్యము కానిది. ముఖము అద్దమునకు ప్రక్కకు జరిగితే అద్దములోని ప్రతిబింబము మాయమగును.



# వేదము - శాంతి

ఈశ్వరానంద భారతీ స్వామి

'సర్వము దుఃఖమయం జగత్' అంటూ ఉంటారు పెద్దలు. అయినను ఆ దుఃఖాన్ని అనుభవించడానికి ఏ జీవుడును అంగీకరింపడు. దానిని తొలగించుకోవాలనే ఆరాటపడుతూ ఉంటాడు. ఆ దుఃఖము తొలగితే శాంతి లభిస్తుంది. శాంతి అంతా శాంతించటము అని అర్ధము. దుఃఖము శాంతించిన స్థితియే శాంతి. అని మనము భావించవచ్చును. మానవునికి అయిదు జ్ఞానేంద్రియములున్నవి. అవన్నీ ఒక్కొక్క వైపుకు విషయాలను వెతుక్కుంటూ పరుగెత్తుతూ ఉంటాయి. అప్పుడు ఆ జీవుడు నాకు అశాంతిగా ఉన్నది అని దుఃఖించుచూ ఉంటారు. ఆ ఇంద్రియముల పరుగును శాంతింపచేస్తే ఆ జీవునికి శాంతి లభిస్తుంది. శాంతి మనస్సుతో అనుభవింపవలసినదే కాని ఆకారము ధరించి కంటికి కనిపించదు. ఈ రహస్యాన్ని గమనించియే త్యాగరాజ స్వామి 'శాంతము లేక సౌఖ్యము లేదు" అని పాడినారు.

శాంతి భేదములు అనేకమున్నాయి. 1. లౌకికమైన శాంతి 2. పారాలౌకికమైన శాంతి అనేవి ముఖ్యమైనవి. లౌకిక శాంతి దేశ కాలపరిస్థితులను బట్టి ఏర్పడగా, పారలౌకిక శాంతి జీవుడు చేసే సాధనా విశేషమును బట్టి అతనికి లభిస్తుంది. లౌకిక శాంతిని ఎంత సాధించినా అది తాత్కాలికమే అవుతుంది. కాని పారలౌకిక శాంతి శాశ్వతమైనది.

ప్రస్తుతము మనము పారలౌకిక శాంతిని పొందుటకు వేదాలు ఏ ఏ అంశాలను ప్రబోధిచాయో తెలిసికొందాము. పార లౌకిక శాంతి అంటే జీవులు ఇహలోకయాత్రను పూర్తిచేసి దేహత్యాగము చేసి ఆత్మరూపముతో పరలోకమందు ఆనందాన్ని అనుభవించటకు లౌకిక ఆనందాన్ని అందుకొనేందుకు వేదము 1. యోగము, 2. జపహోమాదులు 3. అఘదుర్షణ మంత్రములు, 4. రోగనివారక మంత్రములు మొదలైన వానిని సూచించారు. పారలౌకిక శాంతిని పొందటానికి జ్ఞానసాధన అనే మార్గాన్ని సూచించారు. జ్ఞానసాధనకు 1. సద్గురు సమాశ్రయమును, 2. జిజ్ఞాస, 3. భక్తి ప్రపత్తులు, 4. సంపూర్ణ భగవద్విశ్వాసము అనే ఉపాయాలను ప్రకటించినవి.

ఇంద్రియనిగ్రహానికి, చంచలమైన మనస్సును ఏకాగ్రము చేయటానికి యోగ మార్గము ఉపయోగపడుతుంది. ఈ విషయం వేదాలలో ఎన్నో చోట్ల వివరింప

బడింది. కర్మవశముచేత దుఃఖమును అనుభవించే జీవులకు శాంతి సాధనోపాయముగా జపహోమాదులను, వాని ఆచరణ విధానాలను, తత్ఫలితాలను యజుర్వేదము వివరిస్తుంది. పూర్వకర్మ ఫలితముగా ఏర్పడిన, ఈ జన్మలో చేసిన పాపఫలితముగా కలిగిన దు:ఖాలను తొలగించడానికి ప్రాయశ్చిత్త రూపముగా అఘమర్షణ స్నానం అనే శాంతి సాధనోపాయాన్ని కూడా వేదాలు చాటి చెపుతున్నాయి.

"పూర్వజన్మకృతం పాపం వ్యాధిరూపేణ బాధతే" అను వాక్యము మనకందరకు తెలిసినదే. పూర్వజన్మలలో చేసిన పాపమే ఈ జన్మలో వ్యాధి రూపాన్ని ధరించి పీడిస్తూ ఉంటుంది అని దీని భావము. ఆ రోగ బాధలను నివారించుకునేందుకు అనేక మంత్రాలను వేదాలు ఉద్ఘోషిస్తున్నాయి. హృద్రోగము, కామెర్లు, నేత్రరోగములు, చెముడు, కుష్టు, కుంటి, నీరసము, అల్పాయువు, తల్లులకు పాలు లేక పోవుట, గర్భస్రావము మొదలగు అనేక రోగములకు వేదములు నివారణ మంత్రములను ఉపదేశించినవి. వీనితోపాటుగ తుఫానులు తొలగిపోవుటకు, పగతీర్చుకొనుటకు, కోరికలు తీర్చుకొనుటకు, బాకీలు వసూళ్ళగుటకు, కనపడకుండా పోయినవారిని గుర్తించుటకు, శతృవినాశనమునకు, కష్టనివారణమునకు, అయుర్ధాయాభివృద్ధికి, సంతానప్రాప్తికి, దంపతుల అన్యోన్యతకు, గ్రామరక్షణకు కూడ ఎన్నియోమంత్రములు వేదలములయందు సూచింపబడినవి. వాటి అన్నిటిని సోదాహరణముగా మంత్రములలో వివరించుటకు ఈ సంచికలో అవకాశము లేనందునవలన కేవలము దిఙ్మాత్రముగా విషయమును అందించితిమి. ఈ బాధలన్నియు తొలగినచో శాంతి కలిగితీరును కదా!

ఇక పారలౌకిక శాంతి సాధనను గూర్చి కొంత పరిశీలింతము. ఈ లోకమున నున్న జీవుడు పరలోకమునందలి పరబ్రహ్మను తన జ్ఞానసాధన విశేషముచే పొందినపుడు ఐహికదుఃఖముల నుండి అతడు విముక్తడగును. అదియే ముక్తి. అదియే బ్రహ్మానందస్థితి. అదియే జీవుడు అందుకొనవలసిన శాంతి. "సర్వేషాం కర్మాణాం పరమాత్మ జ్ఞానజన్మోపకారకత్వేన పరమపురుషార్థ హేతుత్వం దర్మయితుం శ్రుతిః ప్రవర్తతే" పరమాత్మ దర్శనము చేయించుటకే వేద మార్భవించినదని ఈ వాక్యమునకు భావము "జ్ఞానానాస్తి పరోధర్మః ఇతి వేదాంత నిర్ణయం" అను వాక్యము వేదమునకు జ్ఞానమునకు గల శాంతి సామర్థ్యమును వివరించుచున్నది.



ఈ జ్ఞానమును బోధించు గురువును, సాధించు శిష్యుదును శాంతచిత్తులైనపుడే వారిరువురకును అత్యంతిక శాంతి లభించును. వేదము అట్టి గురుశిష్యుల లక్షణములను, వారిరువురు చర్చించు పరబ్రహ్మము యొక్క స్వరూప స్వభావములను చక్కగా వివరించి శాంతిని ప్రసాదించును.

ఈ వేదములే దశశాంతులు అను మంత్రములను మనకు ప్రబోధించుచున్నవి. ఈ శాంతి మంత్రముల మననము వలనను, మంత్రార్థములను భావించుట వలనను జీవులు సుఖశాంతులనందగలరు. "లోకాః సమస్తా సుఖినోభవంతు" అను పరమోద్దేశ్యముతో వేదము జీవోద్ధరణమునకై సర్వకాలసర్వాస్థల యందును వారాచరింపదగిన శాంతి మార్గములను సూచించినవి.

విజ్ఞాన సాధనములైన, వేదములు యందు ప్రకటింపబడిన శాంతి సాధనోపాయములను జీవులందరును గ్రహించి తాము సుఖమునందుకొని తద్వారా విశ్వశాంతికి మార్గదర్శులగుదురు గాక! అని నారాయణ స్మరణ పూర్వముగ ఆశీర్వదించుచున్నాము.

ఓం సహనావవతు – సహనౌభునక్తు – సహవీర్యం కరవావాహై!

తేజస్వినావధీతమస్తు – మా ద్విషావహై !

ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః


| | |
|---|---|
| **1. మాతృ ఆశ్రమం**<br>శ్రీ శాంతి ఆశ్రమము<br>తోటపల్లి కొండలు,పిన్ : 533 446<br>వయా శంఖవరం, కాకినాడ జిల్లా<br>సెల్ :7382009962 రిసెప్షన్: 7815890094<br>e-mail : srisanthiashram@gmail.com | **4. కోటగిరి శాఖ**<br>పీస్ సెంటర్, డార్మోనా రోడ్,<br>కోటగిరి–643217, నీలగిరిజిల్లా,<br>తమిళనాడు, ఫోన్: 04266– 271945<br>e-mail: vsvmsktg@yahoo.com<br>vsvmsktg@gmail.com |
| **2. విశాఖ : శాంతి ఆశ్రమము**<br>లాసన్స్‌బే, పెదవాల్తేరు–530 017<br>విశాఖపట్నం ఫోన్: 0891 – 2538689<br>e-mail : srisanthiashramvsp@gmail.com | **5. కాకినాడ శాఖ**<br>శాంతి ఆశ్రమము,అశోక్ నగర్<br>కాకినాడ – 533 004<br>కాకినాడ జిల్లా |
| **3. విశ్వశాంతి క్షేత్రం**<br>కైలాసగిరి<br>విశాఖపట్నం | **6. పిఠాపురం శాఖ**<br>స్టువర్టు పేట,పిఠాపురం–533 450<br>కాకినాడ జిల్లా |

Website : www.srisantiashram.org

## వార్తలు

**1. ఉగాది మరియు వసంత నవరాత్రుల సందర్భంగా తొమ్మిది రోజులు తేది. 9-4-2024 నుండి ది. 17-4-24 వరకు శాంతి ఆశ్రమ అన్ని శాఖలలోను సీతారామ అష్టోత్తర శతనామార్చన భక్తిశ్రద్ధలతో ఆశ్రమ వాసులచే జరుపబడినది.**

**2. ప్రతీ నెల 17వ తేదీ నుండి 21వ తేదీ వరకు మాతృ ఆశ్రమములో సాధనా పంచ దివసములు జరుగుచున్నవి. ఉ.5.00 గం॥ల నుండి 5.30 గం॥ల వరకు ధ్యానము, తరువాత ఆదిత్య హృదయము, రామరక్షాస్తోత్రము, విష్ణు సహస్రనామ స్తోత్రము, శ్రీ లలితా సహస్ర నామ స్తోత్ర పారాయణములు జరుగుచున్నవి. ఆసక్తిగల సాధకులు అందరూ ఆహ్వానితులు**

### మాతృఆశ్రమ కార్యక్రమములు :

**తేది. 10-6-2024 (సోమవారం) :** ఓంకార మందిరము ఉ॥ 7.30 గం॥లకు పరమ పూజ్యశ్రీ ఓంకారస్వామి ఆరాధన సందర్భముగా ఓంకారస్వామి అష్టోత్తర శతనామార్చన సా॥ 6.00 గం॥లకు శ్రీరామస్వామి, శ్రీలక్ష్మణస్వామి, రాచపల్లి వారి ప్రవచనము.

### శ్రద్ధాంజలి

**ది. 28-4-2024 (ఆదివారం) శ్రీ నేరెళ్ళ రఘునాధరావు గారు** దివ్యశాంతిలో లీనమయ్యారు. వీరి విజయవాడలో శాంతిసత్సంగ మండలి, ఓంకార్ తపోట్రస్ట్‌ను 12-9-1977లో ప్రారంభించారు. పూజ్యశ్రీ ఓంకార్ వీరిచ్చిన 11 ఎకరాల స్థలములో భవిష్యత్తులో ఒక గొప్ప ఆధ్యాత్మిక కేంద్రం అవుతుందని అన్నారు. 1995లో ఆ ప్రదేశంలో మాతా శివచైతన్య వారు చైతన్య తపోవనం ప్రారంభించారు. 1-3-1996 సం॥లో ఆ తపోవనంలో యూనివర్సల్ సింబల్, శాంతి ప్రార్థన స్థాపనకు శంకుస్థాపన జరిగినది. శ్రీ నేరెళ్ళ రఘునాధరావు గారు శ్రీ ఓంకారస్వామి శతజయంతి ఉత్సవాలలో చాలా ఉత్సాహంగా పాల్గొన్నారు. తమ స్టీల్ వ్యాపారంలో ఉంటూ, ఆటుపోటులు తట్టుకుంటూ సత్పురుషసహవాసంలో శాంతిసత్సంగాలను నిర్వహిస్తూ ఆధ్యాత్మికంగా ఎంతో ఎత్తుకు పయనించారు. వారు ఏప్రియల్ 28న తమ భౌతిక శరీరాన్ని విడచి విశ్వ ఆత్మలో లీనమయ్యారు. వీరు చిరస్మరణీయులు వీరి సతీమణి సీతారత్నంగారికి, కుటుంబ సభ్యులకు మా ప్రగాఢ సానుభూతి.

**శాంతి ఆశ్రమ యాజమాన్యం**



## దాతలకు విజ్ఞప్తి

దివ్యాత్మ స్వరూపులకు సూచన. శ్రీ శాంతి ఆశ్రమమునకు విరాళము ధన రూపంలో / చెక్కు / ఎస్.బి.ఐ. కత్తిపూడి, అకౌంట్ నెం. 11003309435 కు IFSC Code : SBIN0014774 ఆన్‌లైన్ ద్వారా పంపగలరు. మీ విరాళములకు ఇన్‌కమ్‌ట్యాక్స్ 80జి రాయితీ కలదు. మీరు ఏ విధంగా విరాళము పంపినను వ్రాత పూర్వకంగా లేదా ఇమైయిల్ ద్వారా మొబైల్ నంబరు 7382009962 మరియు రిసెప్షన్ నెంబరు 7815890094కు మీ పేరు, చిరునామా మీ మొబైల్ నంబరు తెలుపగలరు.

## శాంతి పత్రిక చందాదారులకు విజ్ఞప్తి

శాంతి పత్రిక ప్రతినెలా 5వ తేదీన పోస్టు చేయబడును.

సం॥ర చందా రూ. 100/-, జీవిత చందా రూ. 1000/- (12 సంవత్సరముల వరకు మాత్రమే), ఎమ్.ఓ/స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, కత్తిపూడి అకౌంట్ నెం. 11003309435, ఆన్‌లైన్ ద్వారా ఈ క్రింది చిరునామాకు పంపగలరు.

ఎమ్.ఓ.ఫారమ్‌లో దిగువ ఫర్ కమ్యూనికేషన్ భాగములో మీ పూర్తి చిరునామా వ్రాయాలి. తదుపరి క్రొత్త చందా లేక పాత చందా అనునది క్లుప్తముగా వ్రాయాలి. పాత చందా అయితే చందాదారు సంఖ్య వ్రాయాలి.

చందాకాలం ముగింపుకు నెలముందే రెన్యువల్ చేసుకొనవలెను. మీ అడ్రస్ మార్పు జరిగితే, ఉత్తరము ద్వారా తెలుపుతూ చందా నెంబరు వ్రాయాలి. చందా వివరములు తెలుపని యెడల సొమ్ము విరాళముగా జమచేయబడును.

కార్యదర్శి, శ్రీ శాంతి ఆశ్రమం (పోస్ట్)
వయా శంఖవరం - 533 446, తూ.గో.జిల్లా

## విన్నపము

విదేశములలో నివసించు ఆశ్రమ భక్తులు విరాళములు ఈ క్రింది ఎఫ్.సి.ఆర్.ఎ (Foreign Contributions Regulation Act) బ్యాంక్ అకౌంట్‌కు తమ యొక్క నివసించే ప్రాంతములోని తమ బ్యాంక్ అకౌంట్ నుండి ఆదేశ కరెన్సీలో పంపగలరు. పంపిన పిదప వివరములు srisanthiashram@gmail.com అనే మెయిల్ ఐడికి మరియు mattavvs07@gmail.com తప్పకుండా పంపవలెను.

బ్యాంకు పేరు : State Bank of India, 11 Sansad Marg, New Delhi -110001

A/c Name : The Mission of peace - FCRA A/c No : 40127798428

Swift Code : SBININBB104

# శాశ్వత అన్నదానం

1. శ్రీ దారపు రామరెడ్డి గారు (కాకినాడ)
వీరి తల్లి శ్రీమతి డి. కనకమ్మ నర్సింహరెడ్డి గారి జ్ఞాపకార్థం 10,000/-
2. శ్రీమతి గాదిరాజు మాణిక్యాంబ గారు (కొమరిగిరి)
వీరి అత్తగారు శ్రీమతి సాగి వెంకటరమణమ్మగారి జ్ఞాపకార్థం 1,00,000/-
3. శ్రీ గుమ్మళ్ళ వీరభద్రరావు గారు (శాంతి ఆశ్రమం)
వీరి భార్య శ్రీమతి లక్ష్మి గారి ఆత్మశాంతి కోరుతూ 10,000/-
4. శ్రీ ఇ.వి. సుబ్రహ్మణ్యం గారు (అన్నవరం) వీరి సోదరి
శ్రీమతి కుచిబొట్ల వెంకట అన్నపూర్ణ గారి జ్ఞాపకార్థం 10,000/-
5. శ్రీమతి గాదిరాజు బంగారమ్మ గారు (విశాఖపట్నం)
శ్రీ గాదిరాజు రామృష్ణం రాజు గారి జన్మదినంసందర్భంగా 30,000/-
6. శ్రీ శిగటాపు సత్యనారాయణ గారు (పిఠాపురం)
వీరి తండ్రి శిగటాపు గోవిందరాజు గారి జ్ఞాపకార్థం 10,000/-
7. శ్రీ కొండుమహంతి వెంకటేశ్వర్రావు గారు (రాజమండ్రి)
వీరి సోదరుడు వెంకట సూర్యనారాయణ గారి జ్ఞాపకార్థం 10,000/-
8. శ్రీమతి పల్లపోతు పద్మావతి గారు (రాజోలు)
వీరి మాతృమూర్తి శ్రీమతి గాదె శకుంతల గారి జ్ఞాపకార్థం 10,000/-
9. శ్రీ అలవ బలరామ పాండు రంగారావు గారు (ఏలూరు)
వీరి పెండ్లి రోజు సందర్భముగా 10,000/-
10. శ్రీ అయినాపురపు వెంకట సుందరరాముం గారు (బెంగుళూరు)
వీరి తండ్రి అయినాపురపు సుందర సూర్యారావు గారి జ్ఞాపకార్థం 10,000/
-



# విరాళములు

1. శ్రీ కె. లక్ష్మారెడ్డి గారు (కరీంనగర్) 502/-
2. శ్రీమతి పి. పద్మావతి గారు (రాజోలు) 4,000/-
3. శ్రీ గోలి రామారావు గారు, శ్రీమతి అన్నపూర్ణ గారు
గోగ్రాసం నిమిత్తం (వేట్లపాలెం) 10,000/-
4. శ్రీమతి సి.హెచ్. సుచరిత గారు (విజయవాడ)
శాంతి యు.పి. స్కూల్ నిమిత్తం 12,866/-
5. శ్రీ రామనేని వెంకట పిచ్చేశ్వర్రావు గారు (చల్లపల్లి) 10,000/-
6. శ్రీ నూకల బాబూరావు గారు (శాంతి ఆశ్రమం)
శ్రీరామనవమి సందర్భంముగా అన్నదానం 10,000/-
7. శ్రీ మంగా విశ్వనాధరావు గారు (విశాఖపట్నం) విద్యాఖర్చుల 5,000/-
8. శ్రీమతి గాదిరాజు బంగారమ్మ గారు (విశాఖపట్నం)
భాగవత్ సప్త సప్తాహం సందర్భముగా 20,000/-
9. వాసవిక్లబ్ ఇంటర్నేషనల్ గోగ్రాసం నిమిత్తం 1,00,000/-
10. శ్రీ పోలిశెట్టి సాయిబాబా గారు (కోటగిరి) 50,000/-
11. శ్రీమతి కె. శాంతి గారు (శాంతి ఆశ్రమం) వీరి భర్త గారు
శ్రీ కె.ఎమ్. బాలకృష్ణా రెడ్డి గారి జ్ఞాపకార్థం 15,000/-
12. శ్రీమతి వి. విజయలక్ష్మి (విశాఖపట్నం) వీరి తల్లిదండ్రులు
సి.హెచ్. కన్నారావు గారు, శ్రీమతి పాపాయమ్మ గారి జ్ఞాపకార్థం 5,000/-
13. శ్రీ వి.పి. సుశీల రావు గారు (విశాఖపట్నం) గోగ్రాసం నిమిత్తం 10,000/-
14. శ్రీమతి భారతీ సుధాకర్ రెడ్డి గారు (తిరుపతి) గోగ్రాసం నిమిత్తం 10,000/-
15. శ్రీమతి భారతీ సుధాకర్ రెడ్డి గారు (తిరుపతి) సప్తసప్తాహం నిమిత్తం 5,000/-
16. శ్రీమతి పొన్నగంటి లక్ష్మీతులసిగారు (బెంగుళూరు) విద్యాఖర్చుల నిమిత్తం
10,000/-
17. శ్రీ కరణం నాగేశ్వర్రావు గారు కుటుంబసభ్యులు (రాజమండ్రి) 5,000/-
18. శ్రీమతి డి.వి.కె. దుర్గ గారు (శాంతిఆశ్రమం) వీరి భర్త గారు
శ్రీ డి.వి.ఆర్. ఆంజనేయులు గారి జ్ఞాపకార్థం 5,000/-
19. శ్రీ పోసిన సత్తిబాబు గారు (కాకినాడ) వీరి షష్టిపూర్తి సందర్భముగా 5,000/-

This Periodical is Registered with Registar of Newspapers, New Delhi Vide R.No. 3447/57,
Dt. 18-12-20 Permitted to Post Under Concessional Postage Vide AP/KD-24/2024-2026

## SRI SANTI ASHRAM ENGLISH PUBLICATIONS

1. Auto Biography of swami Omkar (2 Volumes) ................ Rs. 150/-
2. Life and Teachings of Swami Omkar ................ Rs. 10/-
3. Soham ................ Rs. 10/-
4. Cosmic Fast ................ Rs. 20/-
5. Meditation ................ Rs. 10/-
6. Om Japa ................ Rs. 10/-
7. Control of Mind ................ Rs. 30/-
8. Cosmic Flashes ................ Rs. 10/-
9. In the Hours of Silence ................ Rs. 10/-
10. The Soul of Omkar ................ Rs. 10/-
11. How I learned English ................ Rs. 10/-
12. Reincarnation of my Little Sister ................ Rs. 10/-
13. God Realization Now and Here ................ Rs. 10/-
14. Mystic Prayers and Poems ................ Rs. 20/-
15. The Divine Voice of Omkar ................ Rs. 40/-
16. Auto Biography of Omkar (Revised Edition) ................ Rs. 100/-
17. Petals of Peace ................ Rs. 20/-
18. The Story of my life and Work ................ Rs. 10/-
19. Priceless legacy of Swami Omkar ................ Rs. 10/-
20. The Four Initiations ................ Rs. 10/-
21. Musings ................ Rs. 20/-
22. Peace Prayer ................ Rs. 20/-

**THE MISSION OF PEACE**
**శ్రీ శాంతి ఆశ్రమము**
పోస్టు: శాంతి ఆశ్రమము
(వయా) శంఖవరం - 533 446
కాకినాడ జిల్లా, (ఆం.ప్ర.)
ఫోన్ : 7382009962
email: srisanthiashram@gmail.com
www: www.srisantiashram.org

Book Post

______________________________

______________________________

______________________________

Published by MVV Satyanarayana on behalf of The Mission of Peace - Sri Santi Ashram and printed at Mohan Graphics, Kakinada - 533 001. Ph:0884-2361419 and Published at Thotapalli Hills-533 446, Ph: 73820 09962 Editor : Swamini Vinamrananda